ప్రజాపాలనకు విశేష స్పందన



తాడ్వాయిలో సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని చదువుతున్న తహసీల్దార వరప్రసాద్



లింగంపేటలో మొదటి దరఖాస్తు స్వీకరిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

అధికార కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమానికి భారీ స్పందన వస్తోంది. మొదటి రోజు ప్రజలు ప్రజాపాలనకు భారీగా దరఖాస్తులు సమర్పించారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో మొదటి దరఖాస్తులను ప్రజాప్రతినిధులు, అధికారులు స్వీకరించి కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. చాలా చోట్ల దరఖాస్తు ఫారాల కొరత ఏర్పడింది. దీంతో జిరాక్స్ షాపుల వద్ద ప్రజలు కిటకిటలాడారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జనవరి 6 లోగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అలాగే ఆరు గ్యారంటీలకు సంబంధించి సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. ప్రజాపాలన దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను ఉన్నతాధికారులు పరిశీలించారు. – సాక్షి నెట్‌వర్క్



రాజంపేటలో..



భిక్కనూరులో..



ధర్మారెడ్డిలో..



మాచారెడ్డిలో .. తహసీల్దార్ శ్వేత



సుల్తాన్‌పేట్‌లో..



బోర్లంలో.. స్వీకరిస్తున్న ఎంపీపీ నీరజారెడ్డి



ప్రజలతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి



తాడ్వాయి జీపీ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి సందేశాన్ని చదువుతున్న ఎంపీడీవో రాజీవ్‌



బిచ్కుందలో దరఖాస్తు ఫారాలు ఇవ్వకపోవడంతో ఆందోళన చేస్తున్న ప్రజలు

క్లుప్తంగా

ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు



దోమకొండ: దోమకొండలోని ప్రభుత్వ 30 పడకల క్లస్టర్ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా గురువారం వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన సంగీత్ కుమార్ ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటి సివిల్ సర్జన్‌గా పదోన్నతిపై వెళ్లారు. కామారెడ్డి జిల్లా ఆస్పత్రిలో డిప్యూటి సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు ఇక్కడికి సూపరింటెండెంట్‌గా బదిలీ అయ్యారు. జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త విజయలక్ష్మి ఈ మేరకు వెంకటేశ్వర్లుకు నియామకపత్రం అందజేశారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమం స్థలంలో ప్రహరీ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఆలయానికి సంబంధించిన 33 ఎకరాల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానానికి రూ. 60 లక్షలు ఖర్చు అవుతాయన్నారు. ఆసక్తిగల భక్తులు తమ వంతుగా డబ్బులను విరాళంగా ఇవ్వాలని కోరారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన శబరిమాత వార్షికోత్సవాలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): శబరిమాత ఆశ్రమంలో మూడు రోజుల క్రితం ప్రారంభమైన 53వ వార్షిక జాతర ఉత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. చివరి రోజు కావడంతో ఇతర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఉత్సవాలలో పాల్గొన్నారు. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు వెలిశాయి. భక్తులు రకరకాల వస్తువులు, తిను బండారాలను కొనుగోలు చేశారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని వడ్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సౌజన్య అండర్-14 బాలికల విభాగంలో జాతీయ స్థాయి(ట్రయత్లాన్ విభాగం) 60 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, హై జంప్, జావెలిన్ వంటి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు. ఫిబ్రవరి 16 నుంచి 18 తేదీలలో గుజరాత్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆమె పాల్గొంటారని పేర్కొన్నారు. అలాగే కీర్తన అనే బాలిక హైజంప్‌లో జిల్లా పోటీల్లో మొదటి స్థానం గెలుచుకుందని తెలిపారు. ఇద్దరు విద్యార్థినులను వారు అభినందించారు.

సేవాదళ్ ఉత్సవాలకు తరలిన జిల్లా నేతలు



కామారెడ్డి టౌన్: గాంధీ భవన్‌లో జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ 100 సంవత్సరాల ఉత్సవాలకు జిల్లా నాయకులు గురువారం తరలివెళ్లారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో నాయకులు తరలివెళ్లినట్లు జిల్లా అధ్యక్షుడు లింగాగౌడ్ తెలిపారు. ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు మద్దెల భాగయ్య, సేవాదళ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంగ్యానాయక్, నాయకులు నాసినాయక్, సత్యనారాయణ, సంగని బాబా, నరేందర్‌రెడ్డి, పీర్‌సింగ్, తదితరులున్నారు.

తెరుచుకోని ఆధార్ కేంద్రం



బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఉన్న ఆధార్ నమోదు కేంద్రం గురువారం తెరుచుకోలేదు. ఉదయం 8 గంటలకే ప్రజలు ఆధార్ కేంద్రానికి వచ్చి క్యూలో కూర్చుంటున్నారు. కేంద్రం నిర్వాహకుడి రాక కోసం ప్రజలు కేంద్రం వద్ద పిల్లలతో వచ్చి పడిగాపులు కాశారు. ప్రభుత్వం అందిస్తున్న అభయ హస్తం పథకాల కోసం ఆధార్ కార్డు తప్పనిసరి చేయడంతో చిరునామాలు, తప్పుగా ఉన్న పేర్లు, వయస్సు సరి చేయడం, అప్‌గ్రేడ్, బయోమెట్రిక్ చేసుకోవడం, కొత్తవారు దరఖాస్తు చేసుకోవడం కోసం ప్రతి రోజు వందల మంది ఆధార్ కేంద్రానికి వస్తున్నారు. ఎప్పుడు తెరుస్తారో తెలియడం లేదని, నిర్వాహకుడికి ఫోన్ చేసినా స్పందన లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రేషన్ కార్డులు ఇచ్చిన తర్వాతే అమలు చేయాలి



మాట్లాడుతున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు

కామారెడ్డి అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లుగా రేషన్‌కార్డులు లేక పేద కుటుంబాలు అల్లాడిపోగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కొత్తగా రేషన్‌కార్డులు ఇవ్వకుండా ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించడం పేదలను మోసం చేయడమేనని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బి.బాల్‌రాజ్ విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండానే ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు తీసుకోవడంలో మతలబు ఏమిటని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అర్హులైన పేద కుటుంబాలకు మొదట రేషన్‌కార్డులు జారీ చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ ప్రతినిధులు తమ్మడి స్వామి, దుంపల సురేష్, అరవింద్, నవీన్‌లు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అందేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల ఫలాలు ప్రజలందరికీ అందేలా కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని నాగిరెడ్డిపేట మండల కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం రోజే తమ ప్రభుత్వం ప్రజాపాలన గ్రామసభలను ప్రారంభించడం హర్షించదగ్గ విషయమన్నారు. మాల్తుమ్మెద సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

మూడు కమ్యూనిస్టు పార్టీలు ఏకమయ్యాయి



మాట్లాడుతున్న సీపీఐఎంఎల్ నేత రామకృష్ణ

లింగంపేట(ఎల్లారెడ్డి): కమ్యూనిస్టు పార్టీల ఐక్యత కోసం మూడు పార్టీలు ఏకమైనట్లు సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ వెల్లడించారు. గురువారం లింగంపేట మండల కేంద్రంలో ఆ పార్టీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్సియేటివ్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీలు విలీనమైన సందర్భంగా 2024 మార్చి 3, 4, 5 తేదీల్లో ఖమ్మంలో ఐక్యతా మహాసభలు నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్, జిల్లా నాయకుడు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



పార్టీ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నేతలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాల వద్ద కాంగ్రెస్ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఘన చరిత్ర ఉందని, ఎల్లప్పుడు ప్రజల పక్షాన ఉండి, వారి సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం వచ్చిందని, ఎందరో గొప్ప నేతలను పార్టీ అందించిందని గుర్తు చేశారు.

జిల్లా టీఎన్‌జీవోల నిరసన



కామారెడ్డి అర్బన్: అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా కోల్‌కత్తాలో గురువారం నిర్వహించిన ఊరేగింపులో తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కామారెడ్డి జిల్లా నాయకులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఊరేగింపులో పాల్గొన్నట్టు టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, బి.సాయిలు పేర్కొన్నారు. ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్మగౌరవం నిలబడేదెలా?



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో ఉన్న ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాలలో 200 మందికిపైగా విద్యార్థులు చదువును అభ్యసిస్తున్నారు. వారందరి కోసం నిర్మించిన మూత్రశాలలు, మరుగుదొడ్లు అధ్వానంగా తయారయ్యాయి. బాలికలు వెళ్లే మూత్రశాల, మరుగుదొడ్ల డోరు పాడైపోయింది. దీంతో విద్యార్థులు ఇబ్బందిగా వాటిని వినియోగిస్తున్నారు.

జిల్లా పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యవర్గం



కామారెడ్డి టౌన్: తెలంగాణ రాష్ట్ర పవర్ ఎంప్లాయీస్ యూనియన్ కామారెడ్డి సర్కిల్ రీజనల్ నూతన కమిటీని గురువారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశికుమార్ ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కె.అశోక్, కార్యదర్శిగా కె. చంద్రశేఖర్, కోశాధికారిగా బొడ్డు బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగాధర్, తదితరులను ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



మాచారెడ్డి: విద్యార్థినులు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని బెస్ట్ మోటివేటర్ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. పాల్వంచ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల విద్యార్థినులు 200 మందికి కామారెడ్డి లయన్స్ వివేకానంద క్లబ్ ప్రతినిధులు కెన్వూ సంస్థ సౌజన్యంతో గురువారం హైజెనిక్ కిట్లు పంపిణీ చేశారు. డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు అశ్రద్ధ చేయవద్దన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చీకోటి అశోక్, ప్రోగ్రాం చైర్మన్ బంధం ప్రవీణ్ కుమార్, కోశాధికారి సురేష్, జాన్సన్ అండ్ జాన్సన్ ప్రతినిధి రామానంద్, హెచ్ఎం గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

సేంద్రియ ఎరువులే వాడాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రైతులు సేంద్రీయ ఎరువులు ఉపయోగించి భూసారాన్ని కాపాడాలని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి ముకుందర్ పేర్కొన్నారు. శుక్రవారం కాటేపల్లిలో వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, సాంకేతికతపై రైతులకు రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రైతులను సన్మానించారు. సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ సాయిలు, ఏఈవో రూప పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



బాన్సువాడలో రాస్తారోకో చేస్తున్న ఏబీవీపీ నేతలు



జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో..

బాన్సువాడ: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బాన్సువాడలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 11 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వెంటనే ఖాళీలను భర్తీ చేయాలని అన్నారు. పాఠశాలల్లో మూత్రశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందని, మూత్రశాలలను బాగు చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజనంపై పర్యవేక్షణ కరువైందని, మండల విద్యాధికారి ప్రతి రోజూ పరిశీలించాలని అన్నారు. స్కావెంజర్లను నియమించాలని, ప్రతీ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. నాయకులు శ్రీకాంత్, హనుతేజ్, జశ్వంత్, ఆనంద్, అరవింద్, అభితేజ్, నగేష్, సిద్దు తదితరులున్నారు.

జిల్లా కేంద్రంలో..

కామారెడ్డి టౌన్: విద్యారంగ, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ఏబీవీపీ నేతలు రాస్తారోకో చేపట్టారు. నేతలు చరణ్, జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్, ఖేల్ కన్వీనర్ రోహిత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ప్రత్యూష, నాయకులు రాకేష్, భరత్, అల్తాఫ్ రవితేజ, మనీ, నవీన్, వినయ్ పాల్గొన్నారు.

కొత్తగా రుణం ఇవ్వనందుకు ఆందోళన



ఆందోళన చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

ఎల్లారెడ్డి: లక్ష్మాపూర్ యూనియన్ బ్యాంకు ఎదుట బాలాజీ నగర్ తండాకు చెందిన మహిళా సంఘం సభ్యులు గురువారం ఆందోళన చేశారు. హనుమాన్ సంఘానికి చెందిన మహిళా సభ్యులు గతంలో తీసుకున్న రుణం చెల్లించినా, కొత్త రుణం ఇవ్వడంలో మేనేజర్ ఇవ్వడంలో ఇబ్బందులు పెడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ అభినవ్‌ను వివరణ కోరగా హనుమాన్ సంఘం సభ్యులు గతంలో తీసుకున్న రూ.5 లక్షల రుణాన్ని చెల్లించడంలో చాలా జాప్యం జరిగిందని అన్నారు. మళ్లీ రూ.5 లక్షల రుణం ఇస్తామంటే రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు.

ఎంపీడీవో తీరుపై నిరసన



నిరసన తెలుపుతున్న పంచాయతీ సిబ్బంది

రాజంపేట : మండల కేంద్రంలో ఎంపీడీవో తీరును నిరసిస్తూ గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం ఆందోళనకు దిగారు. తాము నిత్యం పంచాయతీ కార్యదర్శి కేటాయించిన విధులకు అనుగుణంగా తమ తమ పనులకు వెళ్లగా శుక్రవారం ఉదయం ప్రజాపాలనలో గైర్హాజరైన వారిపై చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించడంతో పంచాయతీ సిబ్బంది నిరసనకు దిగారు. ఈ విషయమై ఎంపీడీవో బాలకిషన్‌ను వివరణ కోరగా.. మొత్తం 15 మంది సిబ్బంది ఉండగా ప్రజాపాలన కార్యక్రమం వద్ద కొంత మంది మాత్రమే కనిపించారని, రిజిస్టర్లను పరిశీలించగా ఇందులో కొందరు గైర్హాజరుగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయం వివరణ కోరినట్లు పేర్కొన్నారు.

'ఉపాధి'పై గ్రామసభ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో గురువారం ఉపాధి పనుల సామాజిక తనిఖీకి సంబంధించిన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ జితేందర్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద గతేడాది ఏప్రిల్ నుంచి ఈ యేడు మార్చి వరకు రూ.5 లక్షల 19 వేల విలువగల పనులు చేపట్టారన్నారు. గ్రామసభలో సామాజిక తనిఖీ నివేదికను చదివి వినిపించారు. సర్పంచ్ మంగ్లీ, ఉపసర్పంచ్ గోప్యా, పంచాయతీ కార్యదర్శి అనిత, తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జప్తిజాన్కంపల్లిలో గురువారం నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన గుండ్ల నారాయణ తన సొంతడబ్బులతో గ్రామంలో నవగ్రహాల మండపాన్ని నిర్మించి అందులో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామానికి చెందిన వేదపండితులు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు.

ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పోచమ్మ ఆలయం వద్ద అభిషేకం చేస్తున్న భక్తులు

నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని బంజపల్లి గ్రామ పంచాయతీలో ముత్యాల పోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి బోనాలు, మంగళహారతులో ఊరేగింపు, బోనాల జాతర, ప్రత్యేక పూజలు చేశారు. డీజే, ఆటా పాటలతో మహిళలు పూనకాలు ఊగారు. వేద పండితుడు సంజీవ్‌రావ్‌శర్మ, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర



మద్నూర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



పిట్లంలో..

సాక్షి నెట్‌వర్క్ : అయోధ్య శ్రీరామ తీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం శ్రీరాముడి అక్షింతలతో కూడిన కలశాలతో మద్నూర్, పిట్లంలలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా జై శ్రీరాం అంటూ భక్తులు నినాదాలు చేశారు. సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ.. వచ్చే నెల అయోధ్యలో రామ మందిరం ప్రారంభం కానున్న నేపథ్యంలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. అక్షింతలను ప్రతి ఇంటికి చేరవేస్తామన్నారు.

నేడు ఎల్లారెడ్డిలో శోభాయాత్ర

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో శుక్రవారం అయోధ్య రాముడి అక్షింతల శోభాయాత్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు బజరంగ్‌దళ్ నాయకులు గురువారం తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి రామాలయం వరకు శోభాయాత్ర ఉంటుందన్నారు.

సమాచారం..

నేడు సరస్వతి మహాక్షేత్ర సప్తమ వార్షికోత్సవం

కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులోని సరస్వతి మాత ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 29న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్‌పటేల్, ప్రతినిధి కొలాల సిద్దాగౌడ్, అర్చకులు దత్తురావు, విజయపాండే, ప్రమోద్‌మిశ్రలు తెలిపారు. ఈ సందర్భంగా పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధికంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులుకావాలన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం ఎంపీపీ రాజ్‌దాస్ అధ్యక్షతన 14వ విడత సామాజిక తనిఖీకి సంబంధించి ప్రజావేదిక నిర్వహించనున్నట్లు స్థానిక ఎంపీడీవో రఘు తెలిపారు. ప్రజావేదికకు జెడ్పీటీసీతోపాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

అయ్యప్పస్వామి 34వ పడిపూజ మహోత్సవాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి అయ్యప్పస్వామి దేవాలయం 34వ మండల పూజ మహోత్సవం ఈనెల 29 నుంచి 31 వరకు నిర్వహిస్తున్నట్లు స్వామి అయ్యప్ప సేవా సంఘం, అన్నదాన సేవాసమితి, అన్నప్రసాద సేవా సమితిలు తెలిపాయి. పూజా కార్యక్రమాలుంటాయని ప్రతినిధులు చెప్పారు.